**Eenadu**



# కొత్త కొలువులు

- నూతన జిల్లాల అవసరం మేరకు నియామకాలు
- శాఖలు, జిల్లాల వారీగా ప్రతిపాదనలివ్వాలి
- ఒకే పనితీరున్న శాఖలు ఒకే గొడుగు కిందికి
- జోనల్ విధానం రద్దుకు విధాన నిర్ణయం
- మంత్రులు, అధికారులతో సీఎం కేసీఆర్

ఈనాడు - హైదరాబాద్

కొత్త జిల్లాల అవసరాలకు అనుగుణంగా కొత్త ఉద్యోగ నియామకాలు చేపడతామని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. ఈ మేరకు అన్ని శాఖలు.. జిల్లాల వారిగా ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించారు. సోమవారం సచివాలయంలో జరిగిన మంత్రిమండలి సమావేశంలో, ఆ తర్వాత శాఖాధిపతులు, ముఖ్యకార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. దసరా నుంచి కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాల నుంచి పరిపాలన ప్రారంభానికి ఏర్పాట్లు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కొత్త జిల్లాల్లో పరిపాలన, అవసరాలపై అన్ని ప్రభుత్వ శాఖలు రెండు రోజుల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌శర్మకు ప్రతిపాదనలను అందించాలని మార్గదర్శనం చేశారు. జోనల్ విధానం రద్దుకు ఇప్పటికే విధాననిర్ణయం తీసుకున్నామని, రాష్ట్రంలో ఇకపై జిల్లా, రాష్ట్ర స్థాయి కేడర్లు మాత్రమే ఉంటాయని తెలిపారు. జోనల్ అధికారులకు అన్యాయం జరగకుండా వారిని ఇతర ఉద్యోగాల్లో సర్దుబాటు చేస్తామని వెల్లడించారు. అధికారులు, ఉద్యోగులకు జిల్లాలను కేటాయించే క్రమంలో వారి ఇష్టాయిష్టాలను పరిగణనలోనికి తీసుకోవాలని, ఐచ్ఛికాలకు అవకాశం ఇవ్వాలని ఆదేశించారు. ఒకేరకమైన పని తీరు కలిగిన విభాగాలన్నింటినీ ఒకే గొడుగు కిందికి తెచ్చి, ఒకే అధికారిని నియమించాలని సూచించారు.



**ప్రతీ శాఖకు ఒకే జిల్లా అధికారి:** ఇకపై ప్రభుత్వ శాఖలో ప్రతీశాఖకు (మిగతా 2లో)

## సుపరిపాలనే ధ్యేయం

'సుపరిపాలనతోపాటు పేదరిక నిర్మూలన ధ్యేయంగా కొత్త జిల్లాల రూపకల్పనకు పూనుకున్నా. కొత్త జిల్లాలతో ప్రతీ ఇంటికి మేలు జరుగుతుంది. ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత పెరుగుతుంది. కొత్త జిల్లాల ఏర్పాటుకు ప్రభుత్వం రూపొందించిన ముసాయిదాపై ప్రజలు సంతోషంగా ఉన్నారు. ఆన్‌లైన్‌లో, ప్రత్యక్షంగా ప్రజల నుంచి వచ్చిన సలహాలు, సూచనలు, అభ్యంతరాలు, ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన మీదటే ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుంది. జిల్లా స్థాయిలో ప్రస్తుతం ఉన్న పరిపాలన విభాగాలను యథాతథంగా కొనసాగించాలా? ఏమైనా మార్పులు, చేర్పులు చేయాలా? అన్న అంశంపై అధికారులు సూచనలు చేయాలి. మంత్రులు, శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులు సమావేశమై రెండు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి.

# కొత్త కొలువులు

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా అధికారి హోదాతో ఒక్కరే ఉండాలి. నీటిపారుదల శాఖలకు నీటిపారుదల జిల్లా అభివృద్ధి అధికారి, రోడ్లు భవనాల శాఖకు రహదారుల అభివృద్ధి అధికారి...ఇలా ఇతర శాఖలకు ఇలాంటి హోదాలే ఉండాలి.' అని సీఎం పేర్కొన్నారు.

## ఉద్యోగాల పునర్ వ్యవస్థీకరణ జరగాలి: హరీశ్‌రావు

కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో ఉద్యోగాల పునర్ వ్యవస్థీకరణ జరగాల్సిన అవసరం ఉందని మంత్రి హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. ఇంజినీరింగు శాఖల్లో ఎస్ఈలు, సీఈలు, అటవీశాఖలో డీఎఫ్‌వోలు, కన్జర్వేటర్లు ఇలా రకరకాల పోస్టుల అవసరం లేదని, జిల్లా స్థాయి అధికారి ఒక్కరే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్సైజ్ కమిషనర్ ఆర్వీ చంద్రవదన్ మాట్లాడుతూ 'జిల్లాల పునర్ వ్యవస్థీకరణకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చట్టాలు సవరించాలని సూచించగా' దీనిపై సీఎం స్పందించారు. ఆ సూచనను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు.